
21న సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్ ఎంపిక

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డీఈఎల్ఈడీ, డీపీఎస్సీ కోర్సులకు సంబంధించి డీఈఈసెట్-2024 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు గతంలో జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని వారు ఈనెల 21న జిల్లా కేంద్రంలోని నాగారంలో గల డైట్ కళాశాలలో వెరిఫికేషన్‌కు హాజరుకావాలని డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక ఉంటుందని 30 నుంచి వచ్చేనెల 3 వరకు కేటాయించిన కళాశాలల్లో చేరవల్సి ఉంటుందని ఆయన తెలిపారు.



• నిజాంసాగర్ ప్రాజెక్టుకు జలకళ





• నిండుగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

ప్రాజెక్టులు ఫుల్!

- నిండుకుండలా శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులు
- జిల్లాలో యాసంగి సాగుకు అందనున్న నీరు
- ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేస్తున్న అధికారులు
- ఆయకట్టుకు వరదను మళ్లించి యాసంగికి ఉపయోగపడేలా ఏర్పాట్లు

నిజామాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులు ఫుల్‌గా ఉండటంతో జిల్లాకు యాసంగి సాగుకు ఢోకా లేదు. జిల్లాకు ఉపయోగపడే రెండు ప్రాజెక్టులు నిండుగా ఉండటంతో మొత్తం ఆయకట్టు సాగు కానుంది. రెండు ప్రాజెక్టుల నుంచి యాసంగి సాగుకు నీరు అందనుంది. ప్రాజెక్టుల పరిధిలోనే గుత్ప, అలీసాగర్ ఆయకట్టు కూడా పూర్తిస్థాయిలో సాగుకానుంది. ఖరీఫ్ సాగుకు ఈనెలాఖరు వరకు నీటిని అందించనున్న అధికారులు యాసంగి సాగుపైన దృష్టిపెట్టారు. ప్రస్తుతం ఎగువ నుంచి వస్తున్న వరదను ఖరీఫ్ ఆయకట్టుకు మళ్లిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను కొనసాగిస్తూ నీటి విడుదల చేస్తున్నారు. రెండు ప్రాజెక్టులతో పాటు చెరువులు, రిజర్వాయర్‌లలో కూడా పూర్తిస్థాయి నీటిమట్టాలు ఉండటం వల్ల వ్యవసాయ అధికారులు కూడా యాసంగి ప్రణాళికపై దృష్టి పెట్టారు. ఎంత మొత్తం పంటలు సాగు అవుతాయో అంచనా వేస్తున్నారు.

ఈయేడాది భారీగా కురిసిన వర్షాలు


జిల్లాలో ఈయేడాది వర్షాలు భారీగానే పడ్డాయి. ఈ వర్షాలకు చెరువులతో పాటు ప్రధాన ప్రాజెక్టు నిండాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతో పాటు నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఇప్పటికీ కొద్ది మొత్తంలో వరద కొనసాగుతోంది. శ్రీరాంసాగర్‌కు ఎగువ మహారాష్ట్ర ప్రాజెక్టుల నుంచి నీళ్లు వస్తుండటంతో ప్రతీరోజు గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో కాకతీయ, లక్ష్మి, చౌటపల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు సరస్వతి కాలువలకు సాగునీరు అందుతోంది. వీటితో పాటు గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాలకు కూడా నీటిని అందిస్తారు. ఈ ప్రాజెక్టు పరిధిలో సుమారు రెండున్నర లక్షల ఎకరాల వరకు సాగునీరు అందుతుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో జిల్లాలో 90వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుంది. ఈ రెండు ప్రాజెక్టులు ఈ సంవత్సరం నిండటంతో పాటు ఇప్పటికి వరద కొనసాగుతుంది.

ఎస్సారెస్పీ ఆయకట్టుకు సాగునీరు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు ఎక్కువగా ఉంది. జిల్లాతో పాటు నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల వరకు కాకతీయ కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. ఈ కాలువ ద్వారా సుమారు 9లక్షల 45వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉండటం వల్ల యాసంగి సాగుకు అందనుంది. కాకతీయ కాలువకు ఎస్సారెస్పీతో పాటు లోయర్ మానేరు డ్యామ్‌లో ఉన్న నీటిని కూడా వినియోగించనున్నారు. ఎస్సారెస్పీలో ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులోకి ఇప్పటికీ ప్రతీరోజు 10వేల క్యూసెక్కులకు పైగా వరద వస్తుండటంతో ఎస్కేప్ గేట్లతో పాటు ఇతర గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. అదే రీతిలో ఆయకట్టుకు వరదను మళ్లిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందిస్తే సుమారు 90 టీఎంసీల వరకు నీటిని వినియోగించనున్నారు. ఈ ప్రాజెక్టులో 80 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉండగా ఎల్ఎండీలో 25 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఈ రెండింటిని కలిపి 90 టీఎంసీల వరకు ఆయకట్టుకు యాసంగిలో నీటిని అందించనున్నారు. ఎస్సారెస్పీలో70 టీఎంసీల వరకు నీటిని ఆయకట్టుకు విడుదల చేయనున్నారు. మిగతా 10 టీఎంసీల నీటిని తాగునీటి కోసం నిలువ ఉంచనున్నారు. ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువతో పాటు సరస్వతి, లక్ష్మి, గుత్ప, అలీసాగర్‌లకు ఈ నీటిని వినియోగిస్తారు. ఎల్ఎండీ నుంచి 20 టీఎంసీల వరకు వినియోగించి సూర్యాపేట జిల్లా వరకు సాగునీటిని అందిస్తారు. గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మొత్తం ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నెలాఖరు వరకు ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు. ఆతర్వాత మళ్లీ ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా నవంబర్ చివరన కానీ, డిసెంబర్ నెలలో కానీ నీటిని యాసంగికి విడుదల చేస్తారు. ఎస్సారెస్పీకి అక్టోబర్ 28 వరకు గోదావరి ద్వారా వరద రానుంది. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం శ్రీరాంసాగర్‌కు ఎగువనున్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను అక్టోబర్ 28న మూసివేస్తారు. తిరిగి మళ్లీ జూన్‌లోనే తెరుస్తారు. ఎగువన వర్షాలు ఉండి వరద వస్తే తప్ప గేట్లను తెరవరు. ప్రస్తుతం ప్రాజెక్టులో నిండుగా నీళ్లు ఉండటం వల్ల యాసంగికి ఢోకా లేదని అధికారులు భావిస్తున్నారు.

నిజాంసాగర్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం

నిజాంసాగర్ ప్రాజెక్టులో కూడా ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టం ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులకు గాను 1404.98 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో ప్రస్తుతం పూర్తిస్థాయి కెపాసిటీ 17.802 టీఎంసీలకు గాను 17.773 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టుకు ఇంకా పై నుంచి 3200 క్యూసెక్కుల నీళ్లు వస్తుండటంతో వరద గేట్ల ద్వారా అంతే మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కింద యాసంగిలో మొత్తం ఆయకట్టుకు సుమారు 10 టీఎంసీల వరకు నీటి వినియోగం కానుంది. మిగతా నీళ్లను తాగునీటి కోసంతో ఆపటు వచ్చే ఖరీఫ్ కోసం నిలువ ఉంచనున్నారు. రెండు ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండుగా ఉండటంతో యాసంగి సాగు కోసం వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. యాసంగి ప్రణాళికను ముందస్తుగానే సిద్ధం చేస్తున్నారు. నీళ్లు ఎక్కువగా ఉండటం వల్ల వరి ఎక్కువగా సాగు అయ్యే అవకాశం ఉండటంతో ఈ ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు ఎరువులను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే వరద ఈ ఖరీఫ్‌కు సరిపోతుందని ప్రాజెక్టులలో నీళ్లు నిండుగా ఉండటం వల్ల యాసంగి సాగుకు సరిపోతాయని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



గోదావరిలోకి విడుదల అవుతున్న నీరు

ఎస్సారెస్పీ మూడు గేట్ల ఎత్తివేత

- ప్రాజెక్టులోకి 18వేల క్యూసెక్కుల వరద
- ప్రధాన కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 18 వేల 828క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 9వేల372క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఏఈఈ రవి తెలిపారు. వారం రోజులుగా ప్రాజెక్టులోకి వరద తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టు వరద గేట్లను మూసివేశారు. గురువారం మధ్యాహ్నం ప్రాజెక్టులోకి వరద పెరగడంతో వరద గేట్లను ఎత్తి మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేశారు. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదను ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ప్రాజెక్టు ప్రధాన కాలువల ద్వారా విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 5800క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల నుంచి 2200 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (80.5టీఎంసీ)లు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం నిండుకుండలా ఉందన్నారు. జూన్ 1వ తేదీ నుంచి ఈ సీజన్‌లో ఎగువ ప్రాంతాల నుంచి 248.717టీఎంసీల వరద వచ్చి చేరిందన్నారు. 175.617 టీఎంసీల మిగులు జలాలను కాలువల ద్వారా వరద గేట్ల నుంచి గోదావరిలోకి విడుదల చేశామని అధికారులు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లాల బ్యాడ్మింటన్ ఎంపికలు

సుభాష్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం అండర్-14 బ్యాడ్మింటన్ బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆఫీసర్స్‌క్లబ్‌లో ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1-1-2011 తర్వాత జన్మించిన వారు ఈ ఎంపికలకు అర్హులన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు సరైన కిట్, పూతో జన్మదిన ధృవపత్రాన్ని తీసుకొని రావాలన్నారు. ఉదయం 10గంటల వరకు మైదానానికి చేరుకోవాలని వివరాలకు 9347216426 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉమ్మడి జిల్లాల అండర్-17 ఉషు ఎంపికలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న అండర్-17 బాల బాలికల ఉషు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు మైదానానికి చేరుకోవాలని అన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు బోనాఫైడ్ వెంట తెచ్చుకోవాలని కోరారు. మిగతా వివరాల కోసం 9347216426 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ తదితరులు

మాదక ద్రవ్యాల నిరోధానికి
పకడ్బందీ చర్యలు

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి, క్లోరోహామ్, ఆల్ప్రాజోలం వంటి మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల నిరోధానికి సంబంధిత శాఖ అధికారులు కలిసికట్టుగా కృషి చేస్తూ పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన గురువారం జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. సీపీ కల్మేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సమావేశంలో చర్చించి వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ సూచనలు చేశారు. జిల్లాలో మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని అన్నారు. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దు ప్రాంతాలైన వైజాగ్, పాడేరు, అరకు, తదితర ఏరియాల నుంచి నిజామాబాద్ మీదుగా గంజాయిని అడపా దడపా మహారాష్ట్రకు స్మగ్లింగ్ చేస్తున్నందున గట్టి నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా రోడ్డు, రైలు మార్గాల ద్వారా వీటిని రవాణా చేసే అవకాశం ఉన్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని గంజాయి విక్రేతలను, దాన్ని వినియోగించేవారిని గుర్తించి కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. అదేవిధంగా కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే ఆల్ప్రాజోలం నిల్వలను వెతికితీయాలని ఆ దిశగా పోలీసు, ఎక్సైజ్, రవాణా శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని ఆ వ్యసనం మానుకునేలా డీ-అడిక్షన్ సెంటర్‌లో చేర్పించాలన్నారు. గడిచిన 2023 సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో ఈయేడాది గంజాయి కేసులు కొంత వరకు తగ్గాయని సీపీ కల్మేశ్వర్ అన్నారు. ఎక్సైజ్ శాఖతో సమన్వయం పెంపొందించుకొని మత్తు పదార్థాల రవాణా వినియోగాన్ని పూర్తిగా అరికట్టే దిశగా పోలీసు శాఖ తరఫున కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌వో రాజశ్రీ, ఆర్ఎం జానిరెడ్డి, డీఈవో రవికుమార్, ఆటవీ, రవాణా, వాణిజ్య పన్నుల, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు పాల్గొన్నారు.



జిల్లాకు వచ్చేందుకు
అధికారుల ప్రయత్నాలు!

- గత ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు జిల్లాకు తిరిగి వచ్చేందుకు ప్రయత్నాలు
- ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వేచి చూస్తున్న అధికారులు
- ముందస్తుగానే నేతల ద్వారా పైరవీలు

నిజామాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు, అధికారులు జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మల్టీజోన్ పరిధిలో పనిచేస్తున్న అధికారులు ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వేచి చూస్తున్నారు. తమ జిల్లాలకు రావడంతో పాటు నచ్చిన ప్రాంతాల్లో పనిచేసేందుకు గట్టి పైరవీలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసే ఉత్తర్వుల కోసం వేచి చూస్తున్నారు.

మల్టీజోన్ పరిధిలో బదిలీలు


గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో సొంత జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో పాటు ఇతర అధికారులను వేరే జిల్లాలకు బదిలీ చేశారు. జోన్ పరిధిలోనే కాకుండా మల్టీజోన్ పరిధిలో బదిలీలను కొనసాగించారు. ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా బదిలీలను ప్రభుత్వం చేపట్టలేదు. ఎన్నికల్లో ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులను తిరిగి సొంత జిల్లాలకు పంపించలేదు. ఈ మధ్యనే రాష్ట్రస్థాయిలో రెవెన్యూ శాఖ మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన తహసీల్దార్ల సదస్సులో బదిలీల విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తాము దూర ప్రాంతాల్లో ఉండటం వల్ల కుటుంబాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారిని త్వరగా సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇతర జిల్లాల్లో వెళ్లి పనిచేస్తున్నామని సంవత్సరం కాలంగా దూరంగా ఉంటున్నామని వారు తెలిపారు. గత ఎన్నికల సమయంలో అందరూ బదిలీ కావడంతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా వారికి పరిశీలిస్తామని హామీ ఇవ్వడంతో తహసీల్దార్లు వేచి చూస్తున్నారు. ఈ మధ్యనే బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు వెలువడనున్నాయని రెవెన్యూ అసోసియేషన్ నాయకులు తహసీల్దార్లకు విన్నవించడంతో గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో జిల్లాలో పనిచేస్తున్న 33 మండలాల తహసీల్దార్లను బదిలీ చేశారు. మూడేళ్లు పూర్తి చేసుకున్న వారితో పాటు సొంత జిల్లాల వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అనుగుణంగా వారు బదిలీ అయిన జిల్లాలకు వెళ్లి పనిచేస్తున్నారు.

35 మందికి పైగా ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులు

ఇతర జిల్లాల నుంచి 35 మందికి పైగా తహసీల్దార్లు ఈ జిల్లాకు వచ్చి కొనసాగుతున్నారు. వీరు కూడా సొంత జిల్లాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతర జిల్లాలకు వెళ్లిన జిల్లా తహసీల్దార్లు మాత్రం ఈ జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల తర్వాత గతంలో లాగా బదిలీకి అవకాశం ఉంటుందని వారంతా భావించి ఇతర జిల్లాలకు వెళ్లారు. ఎన్నికల తర్వాత బదిలీ చేయకపోవడం వల్ల అక్కడే కొనసాగుతున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత బదిలీలు చేయలేదు. కుటుంబాలను ఇక్కడే ఉంచి వారు ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నారు.

త్వరలో బదిలీలకు అవకాశం!

తహసీల్దార్ల వినతులు, రెవెన్యూ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు త్వరలోనే బదిలీలకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుండటంతో బదిలీ కాగానే జిల్లాకు వచ్చేందుకు ఎక్కువ మంది ఎదురు చూస్తున్నారు. బదిలీ కాగానే నచ్చిన మండలానికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నేతల చుట్టూ తిరుగుతూ ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. తమకు ఆయా నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. బదిలీ కాగానే సిఫారసు లేఖలు తీసుకొని నచ్చిన మండలాల్లో పనిచేసేందుకు ఎక్కువ మంది ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి, ఎడపల్లి, నవీపేట, మాక్లూర్, ఆర్మూర్, నందిపేట, బోధన్‌తో పాటు పలు మండలాల పరిధిలో పనిచేసేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. ఆ మండలాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన కొంత మంది తహసీల్దార్లు కూడా జిల్లాను విడిచి వెళ్లేందుకు సుముఖత చూపడం లేదు. ఇక్కడి ప్రజాప్రతినిధులకు దగ్గరైన వారు ఎన్నికల బదిలీల నుంచి మినహాయింపు కోరడంతో పాటు ఇక్కడే కొనసాగేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం త్వరలో బదిలీ ఉత్తర్వులు వెలువర్చనుండటంతో ఎక్కువ మంది ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. మొత్తంగా ఈ దఫా ఎక్కువ మంది తహసీల్దార్లు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లినందున ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తే అందరూ తిరిగి జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. జిల్లాకు వచ్చిన తర్వాత వారికి ఆయా మండలాల పరిధిలో పోస్టింగ్‌లను ఇవ్వనున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా ఈ తహసీల్దార్ల బదిలీలు జరిగే అవకాశం ఉంది. తహసీల్దార్లు మాత్రం ముందస్తుగానే ప్రయత్నాలు చేస్తుండటంతో కొంత మంది ప్రజాప్రతినిధులు కూడా తమకు నచ్చిన అధికారులను నియోజకవర్గంలోకి తెచ్చుకునేందుకు మొగ్గు చూపుతున్నారు.



లక్షలు పోసి నిర్మించినా.. లక్ష్యం నెరవేరని రైతు వేదికలు

● రైతులకు అందుబాటులోకి రాని రైతు వేదికలు ● ఏవోలు ఉన్నప్పటికీ రైతులు వెళ్లలేని పరిస్థితి ● అధ్వానంగా మారిన మరుగుదొడ్లు ● నీటి వసతి కరువు



ధర్మారావుపేటలో నిరుపయోగంగా ఉన్న రైతు వేదిక



బోరువేసి వదిలిపిన దృశ్యం



లింగంపల్లి రైతువేదిక వద్ద నిరుపయోగంగా మరుగుదొడ్లు

సదాశివనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా రైతులకు వ్యవసాయ సూచనలు, పంటలపై చర్చించుకోవడానికి లక్షలు పోసి నిర్మించిన రైతువేదికలు అందుబాటులో లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.జిల్లాలో 104 రైతువేదికలు ఒక్కొక్కటి రూ.22లక్షలు వెచ్చించి అగమేఘాల మీద నిర్మించినప్పటికీ ఉపయోగంలేకపోయింది. 25శాతం మాత్రమే గ్రామానికి అందుబాటులో ఉండి కొంతవరకు ఉపయోగపడుతున్నప్పటికి 75శాతం ఊరుచివరన అటవీ ప్రాంతానికి సమీపంలో నిర్మించడంతో ఆ నిర్మానుష్య ప్రదేశానికి మహిళ వ్యవసాయ విస్తరణాధికారులు వెళ్లడానికి భయపడుతున్నట్లు స్థానికులు అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 104 మంది వ్యవసాయవిస్తరణాధికారులు 25 మంది వ్యవసాయాధికారులు ఇందులో 87 మంది రెగ్యులర్,12 మంది ఔట్‌సోర్సింగ్, 5గురు ఆత్మకమిటీ సిబ్బంది పనిచేస్తునప్పటికి రైతులకు చర్చించుకోవడానికి ఎలాంటి వేదికలు అందుబాటులోకి లేకపోవడంతో వ్యవసాయాధికారులు కూడాగ్రామాలలోని ప్రధాన కూడళ్ల వద్ద, గ్రామపంచాయతీల వద్ద రైతులకు పంటలపై అవగాహన కార్యక్రమం తెగుళ్ల నివారణపై సూచనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

● నీరుగారుతున్న రైతువేదికల ఏర్పాటు లక్ష్యం

రైతులకు వ్యవసాయ పంటలపై అవగాహన పంటల సాగు వివరాలు పురుగుమందుల వాడకం సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడానికి మంచి ఉద్దేశ్యంతో రైతువేదికలు నిర్మాణం చేపట్టినప్పటికి 75శాతం జిల్లాలో రైతువేదికలు ఉపయోగంలో లేక రైతులు వినియోగించుకోలేక ప్రభుత్వ ఆచరణ నీరుగారిపోతుందని అనేక మంది రైతులు వాపోతున్నారు. కొన్ని రైతువేదికలలో రైతులకు ప్రొజెక్టర్ ద్వారా పంటల వివరాలు సాగు వివరాలు తెలియజేయాలన్న విద్యుత్ వసతి లేని రైతువేదికలు ఎన్నో ఉన్నట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. ఊరు చివర రైతువేదికలు నిర్మించడంతో వ్యవసాయ అధికారులు కాని విస్తీరణాధికారులు కాని బిక్కుబిక్కుమంటూ ఒక్కరే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడడంతో అటువైపు వెళ్లకుండా గ్రామంలో రైతులు ఉన్నచోటనే కార్యక్రమాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు అంటున్నారు.

● అగమేఘాల మీద నిర్మించడంతో నాణ్యతా లోపం

జిల్లా ఉన్నతాధికారులు నెలలవ్యవధిలో నిర్మించాలని కాంట్రాక్టర్లపై ఒత్తిడి తేవడంతో నాణ్యత లోపంతో అనేక రైతువేదికలు నిర్మించినట్లు రైతులు తెలుపుతున్నారు. దీని ద్వారా నాణ్యత పర్యవేక్షించే అధికారులు పూర్తిగా కరువై కేవలం కమిషన్లకు ఆశపడి బిల్లులు చేయడంతో నిర్మించిన కొన్ని రోజులకే ప్లాట్‌ఫాంలు కుంగిపోవడం,కొన్ని రైతువేదికలు బీటలు వారడం జరిగింది. ఉత్నూర్ రైతువేదికలో ఏర్పాటుచేసిన టైల్స్ పూర్తిగా కుంగిపోవడంతో రాత్రి వేళలో పాములు ప్రవేశించే అవకాశం కూడా ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. రైతువేదికలు నిర్మించినప్పటికీ దాని యొక్క మెయిటెనెన్స్ కోసం వాచ్‌మెన్‌ను ఏర్పాటుచేయకపోవడంతో అసాంఘిక కార్యకలపాలు కొనసాగుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం లక్షల్లో ఖర్చుచేసి నిర్మించిన రైతువేదికలపై దృష్టిసారించి నీటి వసతి ఏర్పాటుచేసి రైతువేదికలను శుభ్రం చేయదానికి అటెండర్‌లను నియమిస్తే బాగుంటుందని పలువురు రైతులు కోరుతున్నారు.

నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తుంది



రైతువేదికలు మంచి ఆలోచనతో నిర్మించినప్పటికీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ చేయకపోవడంతో నాణ్యత లోపం బాగా ఏర్పడింది. దీంతో ఎక్కువ రైతువేదికలు టైల్స్ పగలిపోవడం,కుంగిపోవడం జరిగింది. నెలల వ్యవదిలో నిర్మించడంతో సిమెంట్ వాటర్ క్యూరింగ్ కాక బీటలు వారడం తరుచుగా ఏర్పడడంతో నిర్మాణం ఇంత నాణ్యత లోపంగా ఎలా జరిగిందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా రైతు వేదికల్లో వసతులు కల్పించి రైతులకు సేవలు అందించాలి.

- సాయాగౌడ్ (రైతు, కుప్రియాల్)

చందూర్ ఎంపీడీవో కార్యాలయానికి తాళం



ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేసిన యజమాని

మోస్రా,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల ఎంపీడీవో కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతున్న విషయం విదితమే.ఇట్టి అద్దె భవనంలో గత 48నెలలుగా ఎంపీడీవో కార్యాలయం కొనసాగుతుంది. అయితే అద్దెను 26నెలలుగా కట్టకపోవడంతో యాజమాని ఆగ్రహించి అద్దెకట్టాలని తాళం వేశారు.దీంతో దాదాపు ఒకగంట పాటు కార్యాలయం పనులు కుంటుపడిన వైనం ఎంపీడీవో కార్యాలయం బయట అధికారులు ఉండగా అనంతరం ఎంపీడీవో నీలావతి భవనం యాజమానితో మాట్లాడి ప్రభుత్వం నుండి మాకు అద్దె కట్టడానికి నిధులు రావట్లేదు అందుకనే కట్టలేకపోయాం ఇప్పుడు పై అధికారులతో మాట్లాడి అద్దె డబ్బులు కట్టిస్తామని హామీ ఇవ్వగా యాజమాని ఎంపీడీవో చేతికి తాళం ఇచ్చారు అని ఎంపీడీవో నీలావతి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆశ్వీజ పౌర్ణమి పూజలు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ఆశ్వీజమాస పౌర్ణమి పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రోచ్ఛరణలతో ఆలయాల్లో అభిషేకాలు ప్రత్యేక పూజలు జరిపారు. పలుఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్ర తాలు, పౌర్ణమి పూజలు సాగాయి. జిల్లా కేంద్రంలోని లలితాదేవి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పూజించిన పాలను అందజేశారు. గోల్‌హనుమాన్ దేవాలయంలో కొలువుదీరిన ఆంజనేయ స్వామికి వేదోక్తంగా పంచామృత అభి షేకాలు నిర్వహించి భక్తులకు మహా అన్నప్రసాదాన్ని అందిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజ్ ఆచార్య ఆలయ కార్యనిర్వాహణ అధికారి వేణు, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై కూరగాయలను విక్రయించరాదు

సుభాష్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై కూరగాయలను విక్రయించరాదని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రద్ధానంద్ గంజ్‌లోగల కూరగాయల హోల్‌సెల్ మార్కెట్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్‌లోని దుకాణ యజమానులు దుకాణం స్థలం ఉన్నంత వరకే కూరగాయలు విక్రయించాలని కోరారు. రోడ్లపై కూరగాయలను విక్రయించరాదని దుకాణాదారులకు హెచ్చరించారు. మార్కెట్‌లో ఉన్న సమస్యలపై మార్కెట్ కమిటీ అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ కూడా అంతరాయం లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

భీమ్‌గల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి), తాగుడుకు బానిసై ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ కేంద్రంలో శివగల్లికి చెందిన దడివే రాజేందర్(59) గత కొన్ని ఏళ్లుగా తాగుడుకు బానిసయ్యాడు. ఇందులో భాగంగానే బు.దవారం తాగి ఇంటికి వచ్చిన రాజేందర్‌ను భార్య ఎందుకు తాగి వచ్చవు అని అడగడంతో కోపంతో ఇంటి నుంచి వెళ్ళి అడ్డగుట్ట పరిసర ప్రాంతంలో చెట్టుకు లుంగీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని భార్య దడివే శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

బోధన్‌రూరల్,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని సాలూర, నాగన్‌పల్లి ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనండీకొనడంతో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. బీహార్‌కు చెందిన అక్షయ్ కుమార్(30)అనే వ్యక్తి సమీప గ్రామాలలో కూలీ పని చేస్తుండేవాడన్నారు. బుధవారం రాత్రి నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామన్నారు. గుర్తు తెలియని వాహన వివరాలను సీసీ పుటేజీల ద్వారా సేకరిస్తున్నామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి), మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గుర్తుతెలియని దొంగలు బుధవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. రైతు బట్టు భూమేష్ పొలం వద్ద గల ఎస్ఎస్ 51/ 100 కెవిఏ గల ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దొంగలు ధ్వంసం చేసి ఆయిల్‌ను ఎత్తుకెళ్ళినట్టు లైన్ ఇన్స్‌పెక్టర్ ఆలూర్ గంగారాం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బంగారు గొలుసు చోరీ

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):ఇంట్లో కేవలం ఒక వృద్ధుడు ఉన్న విషయాన్ని గమనించి ఇంట్లోకి వచ్చిన దుండగుడు మాయమాటలు చెప్పి ఆ వృద్ధుని మెడలోని బంగారు గొలుసును చోరీ చేసిన ఘటన నగరంలో జరిగింది. బుధవారం సాయంత్రం నగరంలోని న్యూ ఎన్‌జీవోస్ కాలనీలో నివాసం ఉండే సిద్ధిరాములు ఇంట్లోకి ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మాటా మాటా కలిపి ఆయన మెడలోని రెండు తులాల గొలుసును లాక్కొని వెళ్లిపోయాడు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సంఘటన స్థలాన్ని సీసీఎస్ టౌన్ ఇన్స్‌పెక్టర్ సురేష్, టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజ్, మూడవ టౌన్ ఎస్సై-2 నర్సయ్యలు పరిశీలించారు.

జిల్లాస్థాయి పోటీలకు జట్ల ఎంపిక

భీమ్‌గల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి), జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు అండర్ -14, అండర్ 17 బాలబాలికల జట్లను గురువారం ఎంపిక చేశారు. వేల్పూర్, భీమ్‌గల్ మండలాలకు చెందిన ప్రత ఉపాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొన్నగా ఈ సెలక్షన్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన వీరు శుక్రవారం నుంచి సిర్నపల్లిలో జరిగే జిల్లాస్థాయి పోటీలలో ప్రాతినిధ్యం వహించనున్నారని రమణ తెలిపారు. ఎంపికలో ఎంఈవో స్వామి, ఆయా పాఠశాల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

ముప్కాల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి), ముప్కాల్ మండలంలోని వెంచిర్యాల్ గ్రామంలో బంగారు వెంకన్న ఆలయంలో పౌర్ణమిని పురస్క రించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఆధ్వర్యంలో గురువారం మహాయజ్ఞం నిర్వహించి అనంతరం అన్నదానం నిర్వహించారు. ప్రతీనెల పౌర్ణమి రోజు ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



వెంచిర్యాల్‌లో వెంకన్న సన్నిధిలో హోమం పాల్గొన్న భక్తులు

బషీరాబాద్‌లో కబడ్డీ క్రీడాకారుల జోనల్ సెలక్షన్స్



బషీరాబాద్‌లో కబడ్డీ జోనల్ సెలక్షన్‌కు ఎంపికైన క్రీడాకారులు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్ ఉన్నత పాఠశాలలో గురువారం కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, మోర్తాడ్ మండలాలకు చెందిన కబడ్డీ క్రీడాకారుల అండర్ 14, 17 బాలబాలికల జోనల్ సెలక్షన్స్ గురువారం మండల విద్యాధికారి ఎస్.ఆంధ్రయ్య అధ్యక్షతన జరిగాయి. పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ క్రీడల్లో కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాలకు చెందిన కబడ్డీ క్రీడాకారులు తమ ప్రతిభను కనబర్చగా వారిలో జోనల్ సెలక్షన్స్ చేశారు క్రీడల్లో అసమాన ప్రతిభను కనబర్చి జోనల్‌కు ఎంపికైనా క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనక గంగాధర్, గ్రామస్తులు శ్రీరాముల మురళి, వీడీసీ సభ్యులు, వ్యాయమ ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, మూడు మండలాల వ్యాయమ ఉపాధ్యాయుల, స్థానిక ఉపాధ్యాయులు రవీందర్ మదుసూదన్ శ్రీనివాస్, సుభాష్, రాజు విద్యార్థిని విద్యార్థులు క్రీడాకారులు పాల్గొన్నారు.

విగ్రహాలు ఎత్తికెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలి



సీఐకి వినతి పత్రం అందిస్తున్న కాలనీవాసులు

కామారెడ్డిటౌన్,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్ బోర్డు- లలితనగర్ కాలనీలో బుధవారం అర్ధరాత్రి గ్రామదేవతల విగ్రహాలు ఎత్తికెళ్లినవారిపై చర్యలు తీసుకోవాలని హౌసింగ్‌బోర్డు కాలనీ అసోసియేషన్ సభ్యులు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లలితానగర్ కాలనీలో గ్రామదేవతలైన పోచమ్మ, ముత్యాలమ్మ, లక్ష్మమ్మ ఆలయంలో విగ్రహాలు,అమూల్యమైన వస్తువులు అపహరణ జరిగిందని తెలిపారు.తక్షణమే దోషులను గుర్తించి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మంచిరవి, ప్రధాన కార్యదర్శి బాదవత్ లక్ష్మన్‌నాయక్, అంజయ్య సాయిలు,సిద్ధరామాగౌడ్, స్థానిక కౌన్సిలర్ నిట్టుకృష్ణమోహన్,నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మెండోరలో శ్రీవారి పల్లకీ సేవ ఊరేగింపు

మెండోర, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పల్లకీసేవను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పౌర్ణమి రోజు పురస్కరించుకొని స్వామివారి ఉత్సవ మూర్తులను గోవిందనామాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. పల్లకీసేవ ముందు మహిలు మంగళహారతులతో భక్తులు ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామప్రజలు, పాల్గొన్నారు.

విద్యుత్ డీఈ హరిచంద్‌నాయక్‌కు సన్మానం

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో విద్యుత్ డీఈ కార్యాలయంలో గురువారం విద్యుత్ డీఈ హరిచంద్‌నాయక్‌కు 1104యూనియన్ నాయకులు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఇటీవల సాధారణ బదిలీలో డీఈ హరిచంద్‌నాయక్ నిర్మల్ జిల్లాలో ఎంటీటీ విభాగానికి బదిలీ కావడం జరిగింది. డీఈ హరిచంద్‌నాయక్ విద్యుత్ కార్మికు లకు పక్షపాతిగా వ్యవహరించి రావల్సిన బెనిఫిట్‌లను ఇప్పించారని తన సేవల ను మరిచిపోలేమని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1104యూనియన్ డివిజన్ అధ్యక్షుడు సంజీవ్, ప్రధానకార్యదర్శి నరేందర్‌నాయక్, సతీష్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్,నర్సయ్య, వేణుగోపాల్, షకీల్, రాజేశ్వర్, లక్ష్మణ్‌గౌడ్, హరిశంకర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సరుకుల అందజేత

భిక్కనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన మంగళి నారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెం దాడు. ఈ మేరకు గ్రామానికి చెందిన మట్టెరాంరెడ్డి నిరుపేదలైనా మృతుడి కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబమైనా నారాయణ కుటుంబానికి దాతలు సహకరించాలరు.ఈకార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడ్వాయి,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీచేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూకంటి వెంకటరెడ్డి తెలిపారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను త్వరగా రావడానికి కృషిచేసిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, అధికార ప్రతినిధి మహ్మద్ అలీ, మాజీ సర్పంచ్ సంజీవ్,ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాల నిరసన



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన

బోధన్‌రూరల్,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు గురువారం బోధన్‌లో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట మూతికి నల్లబ్యాడ్జీలు కట్టుకుని వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నోటికి నల్ల గుడ్డలు కట్టుకుని వినూత్న నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ పిలుపు మేరకు నాల్గవ రోజు కార్యక్రమంలో భాగంగా వినూత్న నిరసన చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు కళాశాలల నిర్వాహకులు, అధ్యాపకులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలో తరగతి గదులలో విద్యార్థులకు బోధించే మేము నేడు కావాలని రోడ్డుపైకి వచ్చి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం లేదని కళాశాలల యొక్క ఆర్థిక అసక్తతను ప్రభుత్వానికి స్థానిక సబ్‌కలెక్టర్ ద్వారా తెలియజేస్తున్నామన్నారు. ప్రైవేటు కళాశాలల నిర్వహణ భారంగా మారిందని అందు కొరకు నిరవధిక బంద్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీజు బకాయిలు విడుదల చేసినట్లయితే విద్యార్థులకు రాబోయే రోజులలో నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉంటుందన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మిప్స్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస రాజు, ఉషోదయ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సూర్యప్రకాష్, ఎస్వీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సాయిరెడ్డి, విజయసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జావీద్, రవి పటేల్, సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, అధ్యాపకులు శ్రీకాంత్, దత్తు, శేఖర్, పవన్, నితిన్, దశరథ్, అమ్జద్, తేజస్విని, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి



అమీనాపూర్‌లో పాడి గేదులను పరిశీలిస్తున్న జగన్నాథచారి

వేల్పూర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండలం అమీనాపూర్ గ్రా మంలో మండల పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశుసం వర్ధకశాఖ అధికారి జగన్నాథచారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఇచ్చే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో పశువుల సంఖ్య ఎంత ఉందని, ప్రస్తుతం ఆ పశువుల ఆరోగ్య స్థితి గదులు ఏవిధంగా ఉన్నాయని ఆ గ్రామ రైతులను అడిగితెలుసుకున్నారు. పశువు పోషణ పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పశువులు అనారోగ్యానికి గురైన వృడు వెంటనే మండల పశువైద్యాధికారిణి సంప్రదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి, సిబ్బంది సురేష్, గంగాధర్, మౌలాన, జావిద్, వసంత, పాడి పశువుల రైతులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ జగన్నాథచారి అన్నారు. గురువారం మండలంలోని చింతలూర్ గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారిణి పశువైద్యాధి కారిణి డాక్టర్ శిరీష, గోపాల మిత్ర రాజ్‌కుమార్, సిబ్బంది, వీడీసీసభ్యులుగ్రామస్థులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండం కేంద్రంలో పశువులకు, గేదేలకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి గౌతమ్‌రాజ్ తెలిపారు. గురువారం బాల్కొండ ఉమ్మడి మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో చేపడుతున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వినియోగించుకోవాలని తెలిపారు.

నవీపేట: మండలంలోని కమలాపూర్, మహంతంలలో గురువారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు అందజేశారు. రెండు గ్రామాలలో కలుపుకుని 674పశువులకు టీకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ అధికారి నరేందర్, డీఎల్‌హెచ్, హంస్సేన్, రవి, తదితరులున్నారు.

రుద్రూరు: మండలం అక్బర్‌నగర్ గ్రామంలో గురువారం ఆవులు, గేదేలు, దూడలకు గాలికుంట నివారణ టీకాలు వేయడం జరిగిందని మండల పశువైద్యాధికారి సంతోష్‌కుమార్ పేర్కొన్నారు.

రాజంపేట: కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రంలోని గురువారం పాడి పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు జిల్లా సహాయ సంచాలకుడు సంజయ్‌కుమార్‌తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి అనిల్‌రెడ్డి, సిబ్బంది రాజవీరయ్య, హాజీ, రమేష్,రాములు,రాజేశ్వర్ రైతులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని అంచనూర్ గ్రామంలో బుధవారం పాడి పశువులకు ప్రభుత్వ పశువర్ధకశాఖ ద్వారా ఉచితంగా గాలి కుంటు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి శివ తెలిపారు. కార్యక్రమంలో స్టాక్ అసిస్టెంట్ కిషోర్, వెటర్నరీ అసిస్టెంట్ భూమయ్య, లింగం, బాబు, లక్ష్మీకాంత్, రైతులు పాల్గొన్నారు.

తాడ్వాయి:మండలంలోని కృష్ణాజీవాడి గ్రామంలో ఆవులు,గేదెలకు ఉచిత గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల వైద్యాధికారి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోచయ్య, కొండల్‌రెడ్డి,ప్రేమ్‌సింగ్,గంగారాం, బాలచందర్,కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

● ఒకరికి తీవ్ర గాయాలు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండల శివారులోని హాసాకొత్తూర్ రోడ్డులోగల ఒక ప్రైవేటు పాఠశాల దగ్గరలో బైక్‌అదుపుతప్పి ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామానికి చెందిన దిబ్బ అనిల్ (20) అక్కడికక్కడే మృతిచెందగా బైక్‌పై ఉన్నమరో వ్యక్తి ఇనుగుర్తి శివరాజ్ కు తీవ్రగాయాలయ్యాయి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కమ్మర్‌పల్లి ఏఎస్సై నరేందర్ కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లరాంపూర్ నుంచి పల్సర్ బైక్ పై అనిల్, శివరాజ్ కలిసి కమ్మర్‌పల్లి మండలంల బషీరాబాద్ గ్రామానికి బర్త్‌డే ఫంక్షన్ నిమిత్తం బుధవారం రాత్రి వెళ్లి అర్ధరాత్రి తిరుగు పయనమయ్యారు. కమ్మర్‌పల్లి గ్రామ శివారులోని ప్రైవేటు పాఠశాల వద్ద మూల మలు వద్ద బైక్‌ను అతివేగంగా నడపడంతో బైకు అదుపుతప్పి వ్యవసాయతోటలోకివెళ్లి పడిపోవడంతో దిబ్బ అనిల్ అక్కడికక్కడే మరణించగా వెనకాల కూర్చున్న శివరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం ఉదయం మృతుని పెద్దనాన్న దిబ్బ గంగాదర్ ఫిర్యాదు మేరకు శవపంచనామా జరిపి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి పంపి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో విద్యార్థుల నిరసన

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి), బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో గురువారం ఆర్మూర్ పట్టణంలో విద్యార్థులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బట్టు శ్రీధర్ మాట్లాడుతూ పది నెలలు గడిచిన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయలేదని, రాష్ట్రంలో అద్దె చెల్లించక మూత బడ్డ గురు కులాలు, మెస్ బిల్లులు రాక నీళ్ల చారుతో పూట గడుపుతున్న వసతిగృహ విద్యార్థులు, బిల్లులు రాక అప్పుల పాలైన వార్డెన్ లు ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలో విద్యార్థులకు చదువు దూరం చేసే కుట్ర జరుగుతుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అజయ్, నవీన్, ప్రణయ్, అనిల్, లావణ్య, దీక్షిత, దివ్య, రాణి, మేఘన మనిష, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు భగవద్గీత అందజేత

భిక్కనూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాల సంస్థ చైర్మన్‌గా నియామక మైనా మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన మద్ది చంద్రకాంత్ రెడ్డిని శ్రీ సాయి ఆడపిల్లల తండ్రుల క్లబ్ సభ్యులు గురు వారం భగవద్గీత, పుస్తకాలను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ప్రతిరోజు ఉదయం భగవద్గీతను పఠించాలని కోరారు. ఈ మేరకు చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనను సన్మానించేందుకు వచ్చేవారు శాలువాలు కాకుండా పుస్తకాలను, నోట్‌బుక్కులను తీసుకురావాలని కోరారు. భగవద్గీతను అందజేసిన క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పెజిక రమేష్, కొండల్, సూర్యం, ప్రవీణ్, రమేష్, పోతిరెడ్డి,రమేష్,రాంరెడ్డి,రాజిరెడ్డి, బాపురెడ్డిరాజేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

డెంగీ జ్వరాలతో డిచ్‌పల్లి విలవిల

● రాంపూర్ లో ఇప్పటికే ఇద్దరు మృతి ● పది గ్రామాల్లో డెంగీ బాధితులు



డిచ్‌పల్లి బస్టాండ్ పక్కన అపరిశుభ్రత ఇలా..

డిచ్‌పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌లో ఇప్పటికే డెంగీ జ్వరాలతో ఓ యువకుడు, యువతి మృతి చెందిన విషయం మరిచిపోకముందే మండలంలోని మరో 10 గ్రామాల్లో డెంగీ విజృంభిస్తోంది. ఇందుకు సంబంధించి వైద్యాధికారి సిబ్బంది, పంచాయతీ సిబ్బంది గానీ తూతూ మంత్రంగా సలహాలు సూచనలు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు. నడిపల్లికి చెందిన కొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే యానంపల్లిలో అనిల్, బర్ధిపూర్ లో అంజలి, ధర్మారంలో రాగిని, మన్‌పూర్‌లో రోహన్, రాంపూర్‌లో నిహాల్, గన్నారంలో అబ్దుల్ సోఫియన్‌లు డెంగీ బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



తాడ్వాయిలో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

పశువుల ప్రాణాలు కాపాడరా..!?

- ప్రమాదకరంగా గాలికుంటు వ్యాధి • వ్యాధితీవ్రతతో ప్రాణం కోల్పోతున్న పశువులు
- వ్యాధి నివారణకు పశుసంవర్ధక శాఖ చర్యలు
- జిల్లాలోని అన్నిమండలాల్లో నెలరోజులపాటు నివారణ టీకాలు

కామారెడ్డిటౌన్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమైంది. ఇది సూక్ష్మక్రిములతోపాటు కలుషితనీరు, ఆహారం, వాయుకాలుష్యం ద్వారా పశువులకు వ్యాపిస్తోంది. ఈ వ్యాధి నివారణ కోసం జిల్లాలోని 25 మండలాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేస్తున్నారు. ఈనెల 15 నుంచి నెల రోజులపాటు ఈ టీకాలు కార్యక్రమం జిల్లాలో ముమ్మరంగా కొనసాగించనున్నారు. ప్రతీ ఆరునెలలకోకసారి జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం అమలులో భాగంగా మూగజీవాలకు టీకాలు వేస్తుంటారు. పశువులు జన్మించిన 3నెలల సమయం దాటిన ప్రతీ ఆవు, గేదెలకు టీకాలు వేయనున్నారు.

వ్యాధితో పశువుల ప్రాణాల మీదకు..

దేశవాళికంటే ఎక్కువగా సంకరజాతీ పశువుల్లో గాలికుంటు వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుందని పశుసంవర్ధకశాఖ అధికారులు పేర్కొంటున్నారు. దేశవాళి పశువుల్లో ప్రాణనష్టం పెద్దగా లేకున్న వ్యాధి తీవ్రత అధికంగా ఉంటుంది. టీకాలు వేయించకుంటే ఊపిరితిత్తుల పనితీరుపై ప్రభావం పడి పశువులకు తీవ్రంగా రొప్పు రావడం, పని చేసే సామర్థ్యం తగ్గి పాల ఉత్పత్తి పడిపోతుంది. ఓ దశల్లో చిన్న పశువులు అధిక ఉష్ణోగ్రతలతో మృతిచెందే ప్రమాదం ఉంటుంది. వ్యాధిబారిన పడ్డాక వైద్యం చేయించడం కంటేముందు అప్రమత్తమై రైతులు పశువులకు టీకాలను వేయించాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలోని అన్ని పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల పరిధిలో ప్రతీ పశువుకు టీకాలు వేస్తున్నామని, రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పేర్కొంటున్నారు. కొందరు రైతులు టీకాలు వేయించకుంటే ఏం అవుతుందనే భ్రమలో ఉంటున్నారని అలా చేయడంతో వ్యాధి బారిన పడిన పశువు మృత్యువుడికి చేరే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు ఇలా..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులు నడవలేకపోవడం, దుక్కిటెద్దు పనులు చేసే సామర్థ్యాన్ని కోల్పోతాయి. 103 నుంచి 106 డిగ్రీల జ్వరం రావడం, నోటో,చిగుళ్లపై పొక్కులు వచ్చి మేత,నీరు తీసుకోలేవు. నోటి నుంచి చొంగకారడం,కాలు గిట్టల్లో పుండ్లు పడి పురుగులు కనిపిస్తాయి. పాడిపశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. దీనికి చికిత్స ఖర్చు ఎక్కువగా ఉంటుందని పశువైద్యులు పేర్కొంటున్నారు.జిల్లాలో నెలరోజుల పాటు చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రతి పాడిరైతు ఉపయోగించుకోవాలని అంతేకాకుండా ప్రతీ ఆరునెలలకు ఒకసారి జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచిస్తున్నారు.



పోచారం ప్రధాన కాలువపై లింగంపల్లి కలాన్ వద్ద నిర్మాణం పూర్తయిన బ్రిడ్జి ఇదే..

బ్రిడ్జి పూర్తైంది..
గ్రామం మురిసింది!

- రూ.50.90 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం • పోచారం ప్రధాన కాలువపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న లింగంపల్లి కలాన్ వాసులు

నాగిరెడ్డిపేట, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామం వద్ద పోచారం ప్రధాన కాలువపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కావడంతో గ్రామస్థుల ఎన్నో ఏళ్ల నాటి కల నెరవేరింది. లింగంపల్లి కలాన్ గ్రామస్థుల పంట పొలాలు గ్రామం పక్కన నుంచి ప్రవహించే పోచారం ప్రధాన కాలువ అవతలి వైపున ఉండటంతో ప్రతిరోజు గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్థులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు ఈ పోచారం ప్రధాన కాలువను దాటి వెళ్లాల్సి ఉండేది. లేదా బంజారా తండా గ్రామం నుంచి తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. వర్షాకాలంలో రబీ సీజన్‌లోనూ పోచారం ప్రాజెక్టు ప్రధానకాలువ ద్వారా ఆయకట్టు నుంచి ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల జరగడంతో లింగంపల్లి కలాన్ గ్రామానికి చెందిన చాలా మంది రైతులు ప్రతీరోజు ప్రధాన కాలువ లోంచి నీటిలో ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు వెళ్లేవారు. తిరిగి సాయంత్రం ప్రధాన కాలువ నుంచి ఈదుకుంటూ కాలువ దాటి ఒడ్డుకు చేరి తమ ఇళ్లకు వెళ్లేవారు. ప్రధాన కాలువ నీటిలోంచి ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు వెళ్లే క్రమంలో గతంలో గ్రామానికి చెందిన ఇద్దరు, ముగ్గురు రైతులు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి మృతిచెందిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో గ్రామం పక్కనే ఉన్న పోచారం ప్రధాన కాలువపైన బ్రిడ్జి నిర్మించాలని గత ఎన్నో సంవత్సరాలుగా లింగంపల్లి కలాన్ వాసులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నోసార్లు మొర పెట్టుకున్నారు. ఎమ్మెల్యే, ఎంపీల ఎన్నికలప్పుడు గ్రామానికి వచ్చే ప్రజాప్రతినిధులు ముందు గ్రామస్థులు పోచారం ప్రధాన కాలువపైన బ్రిడ్జి నిర్మించాలని మొర పెట్టుకునేవారు. ఎన్నికల్లో గెలిస్తే బ్రిడ్జిని నిర్మిస్తామని నాయకులు గ్రామస్థులకు హామీలిచ్చేవారు. ఎన్నికల్లో గెలిచాక ఈబ్రిడ్జి నిర్మాణం గుర్తించి పట్టించుకునే వారు కాదని స్థానికులు తెలిపారు. అయితే గత ఎల్లారెడ్డి మాజీఎమ్మెల్యేల జాజాల సురేందర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరీకి కృషిచేశారు. దీంతో గత కేసీ ఆర్ ప్రభుత్వం 50 లక్షల 90వేల రూపాయల వ్యయంతో లింగం పల్లి కలాన్ వద్ద పోచారం ప్రధాన కాలువపైన బ్రిడ్జిని మంజూరు చేసింది. 28 మే 2023న ఈ బ్రిడ్జి నిర్మాణానికి అప్పటి రాష్ట్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి తన్నీరు హరీ‌ష్‌రావు శంకుస్థాపన చేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం పనులను వెంటనే చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణం పనులను మొదట్లో చురుగ్గా జరిపి ఆ తర్వాత కాంట్రాక్టర్ పనులను మధ్యలో కొంతకాలంగా అర్ధాంతరంగా నిలిపివేయగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి బ్రిడ్జి నిర్మాణం పనులను చేపట్టి పూర్తి చేశారు.

• 'ఆంధ్రజ్యోతి' కథనంతో ఆగిన బ్రిడ్జి పనులు మొదలై..

లింగంపల్లి కలాన్ బ్రిడ్జి నిర్మాణం పనులు దిమ్మెల వరకు జరిగి నిర్మాణం పనులు కొన్నినెలల పాటు అర్థాంతరంగా నిలిచిపోవడంతో జూన్ 10, 2024న నిలిచిపోయిన లింగంపల్లి కలాన్ బ్రిడ్జి నిర్మాణం పనులు శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' వార్త కథనాన్ని ప్రచురించింది. ఈ వార్తకు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు వెంటనే స్పంది ంచారు. బ్రిడ్జి నిర్మాణం పనులను వెంటనే చేపట్టి త్వరగా పూర్తి చే యాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను అధికారులు ఆదేశించడంతో కాంట్రాక్టర్ తిరిగి పనులను వెంటనే పునఃప్రారంభించారు. దిమ్మెల వరకు బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగ్గా, స్లాబ్ పనులు, బ్రిడ్జికి ఇరువైపులా సైడ్ వాల్ నిర్మాణం తదితర పనులు మిగిలి ఉండట ంతో కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం పనులను వెంటనే చేపట్టి వేగవం తంగా పనులు జరిపి బ్రిడ్జి నిర్మాణం పనులు ఇటీవల పూర్తి చేశా రు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో ఎన్నో ఏళ్ల నాటి తమ కల నెరవేరిందని స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

• బ్రిడ్జికి త్వరగా ప్రారంభోత్సవం జరపాలి

లింగంపల్లి కలాన్ గ్రామం వద్ద పోచారం ప్రధాన కాలువపైన బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి కావడంతో ఈ బ్రిడ్జిని స్థానిక ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు వెంటనే ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో గ్రామానికి చెందిన ప్రజలు, రైతులు బ్రిడ్జి మీదుగా పంట పొలాలకు రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

బ్రిడ్జి నిర్మాణంతో ఎంతో మేలు

• కోనేరు గారి కుమార్, తాజా మాజీ పర్పంచ్ లింగంపల్లి కలాన్



పోచారం ప్రధాన కాల్వపై బ్రిడ్జి నిర్మాణం జరగడంతో గ్రామానికి ఎంతో మేలు జరిగింది. బ్రిడ్జి నిర్మాణంతో గ్రామ ప్రధాన సమస్య తీరింది. బ్రిడ్జి మంజూరు కోసం గత ఎన్నో ఏళ్లుగా ప్రయత్నించాం. బ్రిడ్జి మంజూరై ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం పూర్తవడంతో గ్రామస్థులందరికీ చాలా ఉపయోగం కలిగింది.

కాలువపై బ్రిడ్జి లేక చాలా ఇబ్బందులు పడ్డాం

• బంధంలా శాంతయ్య, రైతు, లింగంపల్లి కలాన్



పోచారం కాలువపై బ్రిడ్జి లేక చాలా ఇబ్బందులు పడ్డాం. కాలువ దాటాలంటేనే భయం వేసేది. పోచారం కాలువపై బ్రిడ్జి కట్టడంతో చాలా సంతోషంగా ఉంది. గ్రామస్థులందరి ఎన్నో ఏళ్ల సమస్య తీరింది. గ్రామ ప్రజలకు, రైతులకు పొలాలకు వెళ్లేందుకు ఎంతో సౌకర్యం కలిగింది.



బాన్సువాడ పట్టణంలో ప్రధాన రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

బాన్సువాడ వీధుల్లో
కుక్కల బెడద తీరేదెన్నడో?

- ప్రధాన రోడ్లపై కాలనీలో నడవాలంటే జంకుతున్న జనం
- కుక్కల దాడుల్లో గాయాలపాలైన చిన్నారులు, పెద్దలు
- కుక్కల బెడద నియంత్రణకు పట్టించుకోని మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

బాన్సువాడ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కలు నిత్యం ఎక్కడో ఒకచోట ప్రజలపై దాడులు చేస్తూనే ఉన్నాయి. బాన్సువాడ డివిజన్‌లోని అన్నిమండలాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. డివిజన్‌లోని జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, పెద్ద కొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, డోంగ్లి, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాలతోపాటు బాన్సువాడ మున్సిపల్ పరిధిలో ఎక్కడచూసినా గుంపులుగా కుక్కలు కన్పిస్తున్నాయని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని 19వ వార్డుల్లో ప్రధాన రహదారుల పై ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజలు నడవాలన్నా, చిన్నారులు పాఠశాలలకు వెళ్లాలన్నా ఇంటికి వెళ్లాలన్నా కుక్కలు దాడులు చేయడంతో చిన్నారులు ప్రజలు గాయాలపాలై ఆసుపత్రుల పాలవుతున్నారు. ఎక్కడ చూసినా కుక్కల బెడదతో ప్రజలు భయం భయంతో జంకుతున్నారు. ఇప్పటికే పలువురు చిన్నారులు, ప్రజలు కుక్కల దాడిలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటివద్ద ఉన్నారు. ఇంటినుంచి బయటకు వెళ్లాలన్న ఇతరాత్ర పనుల నిమిత్తం బయటకు వెళ్లాలన్న కుక్కల బెడదతో భయభ్రాంతులకు గురవుతున్నారు. కుక్కల నివారణకు మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకున్న పాపానపోలేదు. ప్రజలు కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు సిబ్బందికి, కుక్కల బెడదల నివారించాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. అంతేకాకుండా ప్రజలు సమస్యల పట్ల మున్సిపల్ అధికారులు పట్టిం చుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో కుక్కల బెడద నివారించాలని మున్సిపల్ అధికారులను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రాత్రివేళల్లో ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా.. పాఠశాల నుంచి ఇంటికి వెళ్లాలన్న చిన్నారులపై కుక్కలు విరుచుకుపడుతున్నాయని, కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తున్నారు. ఇలా ఉంటే బాన్సువాడ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో కూడా కుక్కల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ఎక్కడ చూసినా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని చిన్నారులపై, మహిళలపై, పెద్దలపై దాడులు చేపడుతున్నాయని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని జీపీ సిబ్బందిని ప్రజలు కోరుతున్నారు.



గుంపులుగా స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలు

పల్లెల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు!

- మద్యానికి బానిసవుతున్న యువత • పేద కుటుంబాలు విచ్ఛిన్నం
- మామూళ్ల మత్తులో అధికారులు • బెల్టుషాపులపై అధికారులు కొరడా ఝుళిపించేనా?

బాన్సువాడ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఈ మద్యానికి బానిసలైన పేద కుటుంబాలు విచ్ఛిన్నమై రోడ్డున పడుతున్నాయి. యువత మద్యానికి బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటోంది. కొంతమంది యువత మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల పాలవుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. బెల్టుషాపులు విచ్చలవిడగా వెలుస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, మామూళ్ల మత్తుల్లో ఉంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బెల్టు షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినప్పటికీ గ్రామాలలో మాత్రం సంబంధిత అధికారుల కనుసన్నల్లో బెల్టు షాపులు పుట్టగొడుగులు పుట్టుక వస్తూ విచ్చలవిడిగా నడుస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాలలో మాత్రం మద్యం విక్రయించడానికి వేలం పాటలు నిర్వహిస్తున్నారు. వేలం పాటను దక్కించుకోవడానికి ఏకంగా లక్షలు వెచ్చించి వేలం పాటను దక్కించుకుంటున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని ఆయా తండాలలో గ్రామాలలో మద్యాన్ని విచ్చలవిడిగా అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రానికి ఒక్క వైన్ షాపు ఉంటే మండల పరిధిలోని గ్రామాలలో మాత్రం గ్రామానికి ఐదు బెల్టుషాపుల చొప్పున ఉంటున్నాయి. వాటిలో ఒక్క మద్యం సీసాపైన 30 రూపాయలు అదనంగా తీసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంలో ఎక్సైజ్ అధికారుల కనుసన్నలోల జరుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





21 నుంచి పోలీస్ సంస్మరణ వారోత్సవాలు

పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్

నిజామాబాద్‌అర్బన్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది విధినిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారిని స్మరించుకునేందుకు రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి 31 వరకు నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసు సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ తెలిపారు. జిల్లాలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజనల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అమర వీరుల దినోత్సవం, క్యాండిల్ ర్యాలీలు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీలు, వ్యాసరచన పోటీలు, ఫోటోగ్రాఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలు, ఉచిత రక్తదాన శిబిరం కార్యక్రమాలు, జాతీయ ఐక్యత దినోత్సవం, పోలీస్ కళాబృందం మరియు పోలీ స్ బ్యాండ్ ద్వారా రద్దీ ప్రాంతాల్లో కార్యక్రమాల నిర్వహణ, అన్ని థియేటర్లలో స్లైడ్స్ ద్వారా ప్రచారం నిర్వహిస్తామన్నారు.

నిబంధనలు తూచా పాటించాలి

ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతీష్ఠించరాదని ముఖ్యంగా జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట విగ్రహాలను ఏర్పాటు చేయరాదని విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ యొక్క అనుమతులు తీసుకోవాలని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కువ శబ్దంతో డీజేలను ఏర్పాటు చేయరాదని ఇలా చేయడం వల్ల దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బందిపడే అవకాశం ఉందన్నారు. రెసిడెన్షియల్ స్థలంలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయాల్లో 55 డెసిబెల్స్ సౌండ్ మాత్రమే వాడాలని రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు డీజే సౌండ్ పూర్తిగా నిషేధం ఉందని పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించి డీజే సౌండ్ సిస్టమ్‌లు నిషేధించడం జరిగిందన్నారు. సభలు, సమావేశాలు జనసంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహిస్తే సంబంధిత అసిస్టెంట్ పోలీస్ కమిషనర్, 500ల మందికంటే ఎ క్కువ జనాలతో కూడిన కార్యక్రమానికి 72గంటల ముందు సీపీ అనుమతి తీసుకోవాలన్నారు. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పాస్‌పోర్టు, వీసా, రవాణా, టూరిస్ట్ తదితర సేవలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారని కావున ప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు ఇళ్లు అద్దెకు ఇచ్చేముందు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఏ (పెద్దలు) సర్టిఫికెట్ పొందిన సినిమాలను మైనర్లు చూడటానికి థియేటర్లలో అనుమతించరాదన్నారు. పైన తెలిపిన నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే సంబంధిత చట్టాల ప్రకారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

'యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలి'

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు రఘురాం, రెహమాన్ డిమాండ్‌చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఐఏఎస్ అధికారులు ఇన్‌చార్జి వీసీలుగా ఉండటంతో యూనివర్సిటీలు నిర్వీర్యమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వం వీసీలను నియమించడంలో అలసత్వం వహించకుండా రెగ్యులర్ వీసీలను నియమించాలన్నారు. ఎన్నికల సందర్భంగా విశ్వవిద్యాలయాలకు రెగ్యులర్ వీసీలను నియమిస్తామని, యూనివర్సిటీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు వాటిని విస్మరించడం సరికాదన్నారు. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

డిగ్రీ, పీజీ కళాశాలల బంద్ విరమణ

● నేటి నుంచి పునఃప్రారంభం



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల రాష్ట్ర ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ, పీజీ కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన నిరవధిక బంద్‌ను విరమిస్తున్నట్లు ప్రైవేటు కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో పాటు ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రెటరీ బుర్రవెంకటేశ్వం ఇచ్చిన హామీ మేరకు బంద్‌ను విరమిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది జారీ చేసిన టోకెన్‌ల మొత్తం వారం రోజుల్లో విడుదల చేస్తామని రాష్ట్ర నాయకత్వానికి ఉపముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రెటరీ హామీ ఇచ్చారని ప్రైవేటు కాలేజీ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంబోజి హరి ప్రసాద్ తెలిపారు. దీంతో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బంద్‌ను విరమించి శుక్రవారం నుంచి కళాశాలను పునఃప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వంతో చర్చలు జరపడంలో సహకరించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్యకు, టీపీడీపీఎంఎ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డికి, తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్‌కు హరి ప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

ధర్పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టా భూముల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని రామడుగు గ్రామస్థులు గురువారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ 2005లో 1150 సర్వే నెంబర్‌లో 200 మంది అప్పటి ప్రభుత్వం పట్టాలు ఇచ్చారని ఆయన తెలిపారు. సీఎల్‌డీపీ పథకం కింద ఈ భూములకు సంబంధించి నిధులు సైతం మంజూరు అయ్యాయని సాగు చేస్తున్న భూములను అటవీశాఖ అధికారులు వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాదారులు సాగు చేస్తుండగా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంతో రైతులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, దామోదర్, రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో స్పెషల్ డ్రైవ్

ముప్కాల్,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి), బాల్కొండ మండల కేంద్రంలో స్పెషల్‌డ్రైవ్‌ను ఆర్టీవో వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేయగా నెంబర్‌ప్లేట్ లేని వాహనాలు, లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు రోడ్డుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ, స్థానిక ఎస్సై, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

విలీన సభను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు

సుభాష్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్త కార్మికోద్యమ నిర్మాణంలో భాగంగానే ఐఎఫ్‌టీయూ, టీయూసీఐ విలీనం చేస్తూ సభను నిర్వహిస్తున్నట్లు ఈ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విలీనసభ పోస్టర్లను ఆవిష్కరించారు. నగరంలోని మున్సిపల్ సర్కిల్-2 కార్యాలయంలో ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీనసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. కార్మికుల జీవితాలను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టిందన్నారు. మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిరణ్, గంగాధర్, శాంతి కుమార్, శివకుమార్, లక్ష్మయ్య, వరలక్ష్మి, శైలజా, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ఈ నెల 20 న హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలోని టీయూసీఐ‌లో ఐఎఫ్ టీయూ విలీన సభను విజయవంతంచేయాలని పిలుపునిస్తు గురువారం కమ్మర్‌పల్లి గ్రామశివారులోని టెలిఫోన్ టీడీ కంపెనివద్ద గోడప్రతులను ఐఎఫ్‌టీయూ నాయకులు టీడీప్యాకర్లతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క, మాస్‌లైన్ ప్రజా పంథ కమ్మర్‌పల్లి మండల కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: ఈ నెల 20న హైదరాబాద్‌లో జరిగే టీయూసీఐ , ఐఎఫ్‌టీయూ విలీన సభను విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ కోరారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రమేష్ రామకృష్ణడివిజన్ నాయకులు దామోదర్‌కార్మిక సంఘం నాయకులు అనిల్,రవి,అశోక్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: ఐఎఫ్‌టీయూను టీయూసీఐలో విలీనం చేస్తూ ఈ నెల 20న హైదరాబాద్‌లో జరిగే విలీన సభ పోస్టర్లను గురువారం మండలంలోని బోర్గాం గ్రామంలో ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు షట్టి నాగన్న, నడ్పి నాగన్న, ఒడ్డెన్న, షేక్‌నసీర్, పెద్దులు, పోశెట్టి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ ఎమ్మెల్యేరాకేష్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



నందిపేట పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

ఆర్మూర్‌టౌన్,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి), పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఇటీవల ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో హిందువులను అవమానపరిస్తే అసభ్య పదజాలాలను సంబోధించారని, హిందు సామాజాన్ని అవమానపరిచి హేళన చేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, నాయకులు అల్జాపూర్ గంగాధర్, ఆర్మూర్ గంగారాం,గుంజాల పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: మతసరమైన వ్యాఖ్యలు చేస్తూ పలువురి మనోభావాలను దెబ్బతీస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ గుడి విషయంలో జరిగిన సంఘటనపై స్పందించిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి హిందువులు నపుంసకులు, చేతగాని దద్దమ్మ లు, చెత్తనా కొడుకులు అంటూ వ్యాఖ్యలు చేసి మతకల్లోహాలు సృష్టించడానికి కారణమైతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యల పట్ల అశాంతి, అరాచక వాతావరణం నెలకొని భవిష్యత్తులో లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందువులను హేలనచేసిన ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిపై సెక్షన్ 195 ప్రకారం చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్, నాయకులు కోమన్‌పల్లి రాజన్న, సురేందర్, ప్రవీణ్, రవి,రాజేశ్వర్ ఉన్నారు.

ఆర్మూర్‌టౌన్: హిందువుల మనోభావాలను దెబ్బతీసిన పైడి రాకేష్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఉత్తర తెలంగాణ రాష్ట్ర పార్టీ మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి హిందువులపై అవమానకరంగా మాట్లాడుతూ అసభ్యపదజ లాలతో దూషించారని, హిందువుగా పుట్టి హిందువులను దూషించి అవమానిస్తే సహించేదిలేదని ఆమె అన్నారు. తన మాటలను ఉపసంహరించుకోని క్షమాపణ చెప్పాలని లేదా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. క్షమా పణలు చెప్పకుంటే ఇంటిని ముట్టడించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూప, బాగ్య, వజ్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, మేయర్ తదితరులు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధ్యక్షత వహించగా నగర మేయర్ నీతూకిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి జయంతి కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కుల మతాలకు చెందిన సాంప్రదాయాలు, పండుగలకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తూ మహనీయుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తుందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వపరంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రమేష్, డిఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. అదనపు డీసీపిలు కోటేశ్వర్‌రావు, బస్వారెడ్డి, శంకర్‌నాయక్‌లు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, రిజర్వు ఇన్స్‌పెక్టర్లు, పోలీస్ సిబ్బంది, సీసీ, ఆర్ఐ, సీఎస్‌బీ, ఐటికోర్, పోలీస్ కంట్రోల్‌రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రెంజల్: ప్రపంచానికి పవిత్ర రామాయణాన్ని కానుకగా ఇచ్చిన ఆదికవి మహర్షి వాల్మీ అని తహసీల్దార్ శ్రావణ్ అన్నారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయంలో మహర్షి వాల్మీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్: ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వర్నిరోడ్‌లోగల వాల్మీకి రామాలయంలో వాల్మీకి విగ్రహానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి నాడు రామాయణం రచించి రామచరిత్రను భక్తులకు తెలియజేసిన మహాకవి అని వాల్మీకి బోయి సంఘ ప్రతినిధులు కొనియాడారు. దేశవ్యాప్తంగా వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నప్పటికీ జయంతి రోజు సెలవు దినంగా పాటించే విధంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

నందిపేట: మండలంలోని మల్లారం గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మి నర్సింహ స్వామి ఆలయంలో వాల్మీకి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున్ మేస్త్రీ, రవి కుమార్, గడ్డి నర్సింలు, సభ్యులు ఉన్నారు.

నవీపేట: రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం మండలంలోని బినోలలో ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులో ఉన్న వాల్మీకి మహర్షి సమాధి వద్ద పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు కృష్ణప్రసాద్ జోషి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రెంజల్: ప్రపంచానికి పవిత్ర రామాయణాన్ని కానుకగా ఇచ్చిన ఆదికవి మహర్షి వాల్మీకి అని తహసీల్దార్ శ్రావణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలను పెంచాలి

డొంకేశ్వర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి):ప్రైవేటు ఆసుపత్రులలో డెలివరిల కాకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరిలను పెంచాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ అన్నారు. గురువారం డొంకేశ్వర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వైద్యసిబ్బంది ఎఎన్ఎం, ఆశవర్కర్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. గర్భవతులు, రిజిస్ట్రేషన్‌ను వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. డెంగ్యు, మలేరియా వ్యాధులు రాకుండా ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రతీ శుక్రవారం గ్రామాల్లో ఇంటికి తిరిగి పరిశుభ్రత ఉండేలా దోమలు వృద్ధి చెందకుండా రోగాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి విద్యాసాగర్, సూపర్‌వైజర్ సురేందర్, సునీత, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు

డిచ్‌పల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఒకవైపు అకాల వర్షాలతో సతమతమవుతున్న రైతులకు మండలంలోని రాంపూర్, బర్ధిపూర్, మెంట్రాజ్‌పల్లి, ఖిల్లా డిచ్‌పల్లి సహకార సంఘాల పరిధిలో ఏ గ్రామంలోదాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపో వడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు చాలా చోట్ల రెండు వారాల క్రితమే పంటలు కోసి ఆరబెట్టిన రైతులను మాత్రం అకాల వర్షా ఇబ్బందులు గురి చేస్తున్నాయి. సాంపల్లి, ధ ర్మారం, బర్ధిపూర్, దూస్‌గాం డిచ్ పల్లి గ్రామాల్లో వరి పంటలు కోసిన కేంద్రాలు రైతులు ఇక్కట్లు పడుతున్నారు. వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను సన్మానించిన కాంగ్రెస్ నేతలు

సిరికొండ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) నిజామాబాద్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించబడిన రాజేశ్వర్‌రెడ్డిని గురువారం సిరికొండ మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు నరేష్, అడ్వకేట్ బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూలాజీ బాబా ధ్యాన మందిర వార్షికోత్సవం

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగారంలో గల పూలాజీ బాబా ధ్యాన ఆధ్యాత్మిక మందిర 19వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం ధ్యాన ఆధ్యాత్మిక మందిరంలో ఉదయం వేదమంత్రాలతో ధ్వజారోహణం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్యానంతో దైవనందిక జీవితంలో ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత చేకూరుతుందని ముఖ్య అతిథులుగా హాజరైన సిద్దేశ్వర సంస్థాన్ పాట్నాపూర్ గౌరవ అధ్యక్షుడు వామన్, అధ్యక్షుడు కేశవ్ అన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు దయానంద్, ఉపాధ్యక్షుడు గోపాల్, యోగా రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో నవజాత శిశువు మృతి

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖలీల్‌వాడిలో గల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నవజాత శిశువు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. రెంజల్ మండలం తాడ్‌బిలోలికి చెందిన నరేష్‌గౌడ్, గంగామణిలకు నెలలు నిండకముందే మగ శిశువు జన్మించగా వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. గురువారం శిశువు ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. శిశువు బంధువులు మాత్రం వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. డాక్టర్లు మాత్రం శిశువు విషమ పరిస్థితుల్లోనే తమ ఆసుపత్రికి వచ్చిందని హైదరాబాద్ తీసుకెళ్లాలని చెప్పిన ఇక్కడే చేర్పించారని శిశువు మృతి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని వైద్యులు తెలిపారు.

నవంబర్ 1న సోషల్ ఆడిట్

డిచ్‌పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద నవంబర్ 1న ఉదయం 11గంటల కు ఉపాధి హామీ సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఉపాధిహామీ సిబ్బంది సమావేశంలో మాట్లా డుతూ. 2024లో ఉపాధిద్వార చేసిన పనుల తాలూకు వివరాలునివేదిక రూపం లో తయారుచేసి అందజేయాలని ఆదేశించారు.ఈసమావేశంలో సిబ్బందిపాల్గొ న్నారు.

పోలీసుల అదుపులో తొమ్మిది మంది పేకాటరాయుళ్లు

ధర్పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ గురువారం రాత్రి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు ధర్పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు తెలుసుకున్న పోలీసులు దాడి చేసి వారి వద్ద ఉన్న 9 సెల్‌ఫోన్‌లతో పాటు 6 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. వీరి వద్ద నుంచి 12వేల 40 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. పేకాట రాయుళ్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

వర్సిటీలో నల్లబ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన

● పదోన్నతులు కల్పించాలని రిజిస్ట్రార్ యాదగిరికి వినతి

డిచ్‌పల్లి, అక్టోబర్ 17(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి తెలంగాణ వర్సిటీలో 2014లో నియామకం పొందిన అధ్యాపకులకు హైకోర్టు ఉత్తర్వులను అమలు పరుస్తూ పదోన్నతులు కల్పించాలని వర్సిటీ పరిపాలన భవనం ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీ టీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు పున్నయ్య, అసోసియేషన్ కోశాధికారి నాగరాజులు మాట్లాడుతూ.. గతంలో ఈసీ నిర్ణయం మేరకు తెలంగాణ అడ్వకేట్ జనరల్ నుంచి న్యాయసలహ తీసు కోవాలని నిర్ణయించారని, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ నివేదిక అందిన తర్వాత ప్రక్రియ త్వరగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వర్సిటీ అధికారులు పదోన్నతుల ప్రక్రియ రెండు వారాల్లో పూర్తి చేయాలని లేనిచో కోర్టు ధిక్కరణ కింద రిజిస్ట్రార్ ను వ్యక్తిగతంగా కోర్టు కు సెప్టెంబర్ 20న హాజరుకావలని హైకోర్టు ఆదేశించిందన్నారు. ఈ కార్యక్ర మంలో వర్సిటీ టీచర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యనారయణ రెడ్డి, ప్రతినిధులు రాజేశ్వరి, బాల కిషన్, నీలిమా, జమీల్, ప్రసన్నశీల, వాసంచంద్రశేఖర్, రమణచారి, కిరణ్మాయి, సమత, పాల్గొన్నారు.

మినీఅంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

భీమ్‌గల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి), రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న నాలుగు వేల మంది మినీఅంగన్‌వాడి కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు ఆధ్వర్యంలో గురువారం భీమ్‌గల్ సెక్టర్ కోఆర్డినేటర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో యమున, మంజుల, గంగలక్ష్మి, ప్రమీల, వసంత, చంద్రకళ, పద్మ, తదితరులు ఉన్నారు.

రేపు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుబాష్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం ఏర్పడుతుందని నగర ఏడీఈలు చంద్రశేఖర్, ప్రసాద్‌రెడ్డి, వీరేశంలు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతులో భాగంగా ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.నగరంలోని పవర్‌హౌజ్, తిలక్‌గార్డెన్, దుబ్బ, మిర్చికంపౌండ్, వినాయక్‌నగర్, బోర్గాం, ముబారక్‌నగర్, అర్సపల్లి, న్యూ హౌజింగ్‌బోర్డు, గూపన్‌పల్లి ఉపకేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాని కోరారు.

జిల్లా సాఫ్ట్‌బాల్ బాలుర ప్రాబబుల్స్ ఎంపిక

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి), ఆర్మూర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జిల్లా సబ్‌జూనియర్ బాలుర జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి గంగామోహన్ తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరైన వారి నుంచి 30మంది బాలురను ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామని వారు ఈనెల చివరి వారంలో జరగనున్న రాష్ట్ర సబ్‌జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో జిల్లా ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపిక కార్యక్రమంలో సీనియర్ వైస్‌ప్రిన్సిపాల్ సాయన్న, గంగాధర్, అకాడమి కోచ్ నరేష్, వ్యాయమ ఉపాధ్యాయులు సంతోష్, రాజేందర్, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పూజారి ఇంట్లో చోరీ

నిజామాబాద్ అర్బన్,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):నగరంలోని సీతారాంనగర్ కాలనీలో నివాసం ఉండే పూజారి ఇంట్లో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. ఈనెల 15న దిలీప్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వినాయక్‌నగర్‌లో ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్లాడు. ముగ్గురు దుండగులు బుధవారం రాత్రి ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని 25వేల నగదు, 4 గ్రాముల బంగారం, 2 తులాల వెండిని ఎత్తుకెళ్లినట్లు పూజారి దిలీప్ తెలిపారు. చోరీదృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. బాధితుడు ఐదోటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కన్నుల పండువగా రథోత్సవం



డిచ్‌పల్లిలో రథం లాగుతున్న భక్తులు

డిచ్‌పల్లి,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):ఏడోపోలీస్ బెటాలి యన్ పక్కన గల లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రథోత్సవం జరిగింది.ఈసంద ర్భంగా వేద బ్రాహ్మణులు ఆలయ ప్రాంగణంలో నిత్యారాధన, బలిహర ణం, చంద్ర దర్శనం, రథహోమం, ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వ హించారు. పంచోపక్త అభిషేకలు నిర్వహించి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామి సహిత, శ్రీదేవి భూదేవి విగ్రహాలను ఆలయ నిర్మాణకర్త వెంకట్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, భూదాన కర్త శ్యాంసుం దర్, వినోద్ రాజు, డా.నారాయణలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని లాగే కార్యక్రమం శ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయర్ స్వామి హజరయ్యారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు

సిరికొండ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నకిలీ గల్ఫ్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని సిరికొండ ఎస్సై ఎల్‌రామ్ మండల యువతను కోరారు. పుట్టి పెరిగిన ఊరిలో ఉపాధి కరువై గల్ఫ్ బాట పట్టిన యువత నకిలీ ఏజెంట్లను నమ్మవద్దన్నారు. గల్ఫ్‌లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పాస్‌పోర్టు, వీసా,రవాణ, టూరిస్టు తదితర సేవలు కల్పిస్తామని ఏజెంట్లు చెప్పె మాయ మాటలు నమ్మి మోస పోవద్దని కోరారు.చాలా మంది గల్ఫ్ ఏజెంట్లు అనాధికార వ్యాపారాలు నిర్వహిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్సై రామ్ తెలిపారు. మద్యం తాగి ఊగే వారు మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరంగా, వికృత చేష్టలు చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒక రోజు జైలు

బోధన్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపించిన కేసులో బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ న్యాయాధికారి శేష తల్పసాయి మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి గురువారం ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. బుధవారం అతిగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న షేక్ ఇస్మాయిల్ అనే వ్యక్తిని గురువారం కోర్టులో బోధన్ పోలీసులు హాజరు పరిచారు. ఈ సందర్భంగా న్యాయాధికారి శేష తల్పసాయి వెయ్యి రూపా యల జరిమానాతో పాటు ఒకరోజు జైలు శిక్ష విధించారు." పట్టణంలోని ప్రధానకూడళ్ల వద్ద ప్రతిరోజు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిం చడం జరుగుతుందన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.95	రూ.220	రూ. 240
వెన్‌కాబ్ (కిలో)	రూ.100	రూ.225	రూ. 960

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.79,100	రూ.73,000	రూ.960

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : వెట్టయన్ (10.10)
: ది వైల్డ్ రోబోట్ (ఇంగ్లీష్ 3డి) (1.40, 7.45, 10.15)
: దేవర (4.10)
స్ర్కీన్-2 : ది వైల్డ్ రోబోట్ (ఇంగ్లీష్ 3డి) (10.30)
: విశ్వం (1.00, 7.15)
: జనక అయితే గనక (4.15, 10.30)
స్ర్కీన్-3 : ఇద్దరు (10.00)
: లవ్‌రెడ్డి (1.00, 7.30)
: వెట్టయన్ (4.00)
: ఖర్గం (10.30)
స్ర్కీన్-4 : రివైండ్ (10.25)
: వీక్షణం (1.20)
: జిగ్రా (హిందీ) (4.00)
: విక్కీ విద్య కా ఓ వాలా వీడియో (హిందీ) (7.20)
: వెట్టయన్ (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : విశ్వం (10.20, 1.20, 4.20, 10.30)
: దేవర (7.25)
స్ర్కీన్-2 : కల్లు కంపౌండ్ (10.40)
: జనక అయితే గనక (1.30, 7.35)
: లవ్‌రెడ్డి (4.30)
: జిగ్రా (హిందీ) (10.30)
స్ర్కీన్-3 : వెట్టయన్ (10.30, 4.35, 7.40, 10.40)
: ఖర్గం (1.40)

దేవి : జనక అయితే గనక (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : విశ్వం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : వెట్టయన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)